# దశ

నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM

బుధవారం 10 09 2025

సంపుటి 1 సంచిక 132

పేజీలు : 02

UDYAM / TS-09-0148996


## చరిత్రలో ఈ రోజు



1895: కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జననం (మ.1976).



1887: భారతదేశ స్వాతంత్ర్య సమరయోధుడు గోవింద్ వల్లభ్ పంత్ జననం
1905: తెలుగు చలనచిత్ర సంగీతదర్శకుడు ఓగిరాల రామచంద్రరావు జననం
1920: గణిత, గణాంక శాస్త్రజ్ఞుడు కల్యంపూడి రాధాకృష్ణ రావు జననం.
1921: భారతీయ చిత్రకారుడు వడ్డాది పాపయ్య జననం (మ. 1992).
1922: భారతదేశ రసాయన శాస్త్రవేత్త యలవర్తి నాయుడమ్మ జననం. (మ. 1985)
1985: తెలంగాణా వీరవనిత చాకలి ఐలమ్మ మరణం (జ. 1895).
1992: దక్షిణ భారత నటి కేథరీన్ థెరీసా జననం.
1944: భారత స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ దండు నారాయణ రాజు మరణం.
2003: ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం



## విద్యా రంగంలో సమూల మార్పుల కృషికి

# మద్దతు ఇవ్వండి

**నియోజకవర్గాల్లో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మిణానికి కృషి**


**బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల్లోని పిల్లలకు కార్పొరేట్ తరహా విద్య**

**కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామ కి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి**

**దశ, హైద్రాబాద్ :** తెలంగాణ విద్యా రంగంలో సమూల మార్పులు తేవడానికి తాము చేస్తున్న కృషికి మద్దతు ఇవ్వాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామ కి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో సుమారు 90 శాతంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల్లోని పిల్లలకు కార్పొరేట్ తరహా విద్యను అందించేందుకు తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను కేంద్ర మంత్రి కి వివరించారు.సీఎం ఢిల్లీ నార్త్ బ్లాక్ లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి తో మంగళవారం సమావేశమయ్యారు. రాష్ట్రంలోని 105 శాసనసభ నియోజకవర్గాల్లో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే నాలుగు పాఠశాలల నిర్మాణ పనులు మొదలయ్యాయని, మిగతా పాఠశాలలకు సంబంధించి టెండర్లు ముగిశాయన్నారు. ఒక్కో పాఠశాలలో 2,560 మంది విద్యార్థులు ఉంటారని, 2.70 లక్షల మంది విద్యార్థులకు ఈ పాఠశాలల్లో చదువుకునే అవకాశం లభిస్తుందని ముఖ్యమంత్రి వివరించారు.

అత్యాధునిక వసతులు,ల్యాబ్‌లు, స్టేడియాలతో నిర్మించే ఈ 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి రూ.21 వేల కోట్ల వ్యయమవుతుందని వివరించారు. అలాగే రాష్ట్రంలో జూనియర్, డిగ్రీ, సాంకేతిక కళాశాలలు, ఇతర ఉన్నత విద్యా సంస్థల్లో ఆధునిక ల్యాబ్‌లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు రూ.9 వేల కోట్లు వెచ్చించనున్నట్లు కేంద్ర మంత్రి గారికి సీఎం తెలిపారు. ఈ నిధుల సమీకరణకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు అనుమతించడంతో పాటు ఎఫ్ఆర్‌బీఎం పరిమితి నుంచి మినహాయించాలని నిర్మలా సీతారామన్ ని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంపై చేస్తున్న వ్యయాన్ని పెట్టుబడిగా పరిగణించాలని కోరారు.

గత ప్రభుత్వంలో అధిక వడ్డీలకు అప్పులు తీసుకువచ్చిందని, వాటి చెల్లింపు రాష్ట్ర ప్రభుత్వానికి భారంగా మారిన నేపథ్యంలో వాటి రీస్ట్రక్చరింగ్‌కు అనుమతించాలని కోరారు. ముఖ్యమంత్రి గారు చేసిన విజ్ఞప్తులపై నిర్మలా సీతారామన్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు డాక్టర్ మల్లు రవి , పోరిక బలరాం నాయక్ , సురేశ్ షెట్కార్ , చామల కిరణ్ కుమార్ రెడ్డి తో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు ఉన్నారు. అంతకు ముందు ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలోని నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. రాష్ట్రానికి చెందిన పార్టీ ఎంపీలతో కలిసి నివాళులర్పించారు.



## సీఎం సహాయ నిధి పేదలకు వరం: ఎమ్మెల్యే మల్‌రెడ్డి

**దశ, అబ్దుల్లాపూర్‌మెట్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల పాలిట వరంలాంటిదని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంగళవారం పెద్ద అంబర్ పేట్ మున్సిపల్ పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్దిదారులకు తొర్రూర్ క్యాంఫ్ ఆఫీసులో రూ. 9. 27 లక్షల చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ... సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు వరంలాంటిదన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదలకు అప్పుడు అండగా ఉంటుందని పేర్కొన్నారు. గత పాలకులు సీఎం సహాయ నిధిని కూడా దుర్వినియోగం చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కరాచారి, మండల పార్టీ అధ్యక్షులు కొత్త ప్రభాకర్ గౌడ్, సీనియర్ నాయకులు కందాల రంగారెడ్డి, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, కిషన్, కే వెంకట్ రెడ్డి, ధన్‌పాల్‌రెడ్డి, మూల కిరణ్, అంతటి ధనరాజ్, రాజు నాయక్ తదితరులున్నారు.



## భక్తులకు కుళ్లిన పులిహోర

### కర్మన్ ఘాట్ హనుమాన్ ఆలయంలో పంపిణీ

ప్రసిద్ధ కర్మన్ ఘాట్ హనుమాన్ ఆలయంలో పంపిణీ చేసిన ప్రసాదంలో కుళ్లిన పులిహోర వచ్చింది. ప్రసాద నాణ్యతపై భక్తుల ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆలయానికి వచ్చిన భక్తుడికి తాను తీసుకున్న ప్రసాదంలో కుళ్లిన పులిహోర.. అందులో పురుగులు కనిపించడం కలకలం రేగింది. ఆ భక్తుడు వెంటనే ఆలయ ధర్మకర్తలకు చూపించి, ప్రశ్నించాడు. కాగా, ఆలయంలో కుళ్లిన పులిహోర ఇచ్చారని వస్తున్న వార్తలో వాస్తవం లేదని ఆలయ ఈవో లావణ్య తెలిపారు. ఆలయంలో వండిన ప్రసాదాన్ని నిల్వ చేయమని, పులిహోర మిగిలితే అదే రోజు భక్తులకు పంచి పెట్టడం లేదా పార వేస్తామని వివరించారు.

దశ, ఎల్బీనగర్



## డబ్బులు వసూలు చేస్తున్న విలేకరులు అరెస్టు

ప్రజలను బెదిరించి డబ్బులు వసూలు చేసి, మోసం చేస్తున్న ఇద్దరు రిపోర్టర్లను మంగళవారం నాగోల్ పోలీసులు అరెస్ట్ చేశారు. రెవెన్యూ శాఖ అధికారులమని అనుమతి లేకుండా బోర్లు వేస్తున్న వ్యక్తులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. దిల్ సుఖ్ నగర్ లో నివాసం ఉంటున్న రాచకొండ సతీశ్(32), ఓ పత్రికలో, శ్యామ కూరి శివగౌడ్ అలియాస్ శివ(36) ఓ ఛానల్లో రిపోర్టర్ గా పని చేస్తున్నారు. మరో నిందితుడు దామెర నాగ ఫణీంద్ర పరారీలో ఉన్నాడు. రిపోర్టర్లుగా పని చేస్తున్న ఈ ముగ్గురూ అనుమతి లేకుండా బోర్లు వేస్తున్నవారిని రెవెన్యూ అధికారులమని చెప్పి రూ,20 నుంచి 30 వేలు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు.

దశ, ఎల్బీనగర్



## సాహిత్య ఋషి కాళోజీ: రవీందర్ రెడ్డి

**దశ, పెద్ద అంబర్ పేట :** ఎవరికీ తలవంచని ఎక్కడ రాజీ పడని, ధిక్కార నైజం కలిగిన ప్రజాకవి కాళోజీ అని పెద్ద అంబర్ పేట మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ లో కాళోజి జయంతి సందర్భంగా నిర్వహించిన తెలంగాణ భాషా దినోత్సవ కార్యక్రమంలో అయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గణితశాస్త్ర విద్యార్థి అయిన తాను కాళోజీ వ్యక్తిత్వం, సాహిత్యం పట్ల అమితమైన ఇష్టంతోనే ఆయన పై పరిశోధన చేసినట్లు చెప్పారు. భారత దేశ ప్రధానమంత్రిని, సగటు మనిషిని, ఇద్దరినీ ఒకే దృష్టితో దర్శించగలిగే ఉదాత్త స్వభావం కాళోజీకి మాత్రమే ఉందని అన్నారు. కాళోజిలా జీవించటం అందరివల్లా సాధ్యం కాదని, ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ గళమెత్తి, కలమెత్తి గర్జించేవాడనీ, ఆవేశం, ఆవేదన కాళోజీ కవిత్వానికి ప్రాణమని, అందుకే అది అందరికీ అర్థమయ్యే భాషలో రాశారని అన్నారు. గాంధిలోని ఆచరణ తత్వం కాళోజిలో కనిపిస్తుందని అన్నారు. అత్యంత నిరాడంబరమైన జీవితాన్ని గడిపిన సాహిత్య ఋషి కాళోజీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ మేనేజర్ కిరణ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## లై డిటెక్టర్ పరీక్షకు సిద్ధమా?

**సీఎంకు కేటీఆర్ సవాల్.. ప్రతి రూపాయికి లెక్క ఉంటే.. అవినీతి ఎక్కడ?**

**హైకోర్టు ఆదేశాల ప్రకారం నడుచుకోవాలని సీఎంకు కేటీఆర్ సూచన**



**దశ , హైదరాబాద్:** మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు కు సంబంధించిన నందినగర్‌లోని నివాసానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు మంగళవారం వెళ్లారు. ఈ క్రమంలో కేటీఆర్‌తో హరీశ్‌రావు పలు కీలక అంశాలపై చర్చించారు. ఏసీబీ కేసు ఇష్యూపై ఇద్దరి మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఫార్ములా ఈకారు రేసు కేసులో మాజీమంత్రి కేటీఆర్, ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, ఇతర అధికారులు బీఎల్ఎన్ రెడ్డి, కిషన్‌రావు, ఎఫ్ఈవోలను ప్రాసిక్యూట్ చేసేందుకు తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతి ఇచ్చారు. అయితే, ఈ విషయంపై కేటీఆర్ స్పందించారు. మళ్లీ చెబుతున్నా ఫార్ములా ఈ కేసులో ఏమీ లేదని... అదో లొట్ట పీసు కేసు అంటూ విమర్శించారు. తాను ఇక్కడే ఉంటానని, ఎవరైనా వచ్చి లై డిటెక్టర్ పరీక్ష చేసుకోవచ్చని సవాల్ చేశారు . బీఆర్ఎస్ ప్రభుత్వంలో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచేందుకు అన్ని రకాలుగా ప్రయత్నాలు చేశానని ఉద్ఘాటించారు. రూ.46 కోట్లు గత కేసీఆర్ ప్రభుత్వంలో ఇవ్వమని తానే ఆదేశాలు ఇచ్చానని గుర్తుచేశారు. ఫార్ములా ఈకారు రేసు కేసు నిర్వాహకులకు రూ.46 కోట్లు చేరాయని తెలిపారు. రూపాయి కూడా ఎక్కడా తారుమారు కాలేదని స్పష్టం చేశారు. ప్రతి రూపాయికి లెక్క ఉంటే... అవినీతి ఎక్కడ..? , అవినీతి నిరోధకం ఎక్కడ..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రాసిక్యూషన్ చేసినా, ఛార్జ్ షీట్లు వేసినా ఏమీ చేయలేరని చెప్పుకొచ్చారు. తాము మాత్రం కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీలు, హామీలపై పోరాడతామని ఉద్ఘాటించారు. సీఎం రేవంత్‌రెడ్డి, తాను ఇద్దరం లై డిటెక్టర్ పరీక్ష ఎదుర్కొందామని ఛాలెంజ్ చేశారు . ఎన్నికల ముందు మాట ఇచ్చి... ఆ తర్వాత మొఖం చాటేయడం రాజకీయం కాదని విమర్శించారు. గ్రూప్ వన్ విషయంలో రాహుల్ గాంధీ జోక్యం చేసుకుని హైకోర్టు ఆదేశాల ప్రకారం నడుచుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డికి చెప్పాలని సూచించారు. విద్యార్థులపై పెట్టిన కేసులు వెంటనే ఎత్తివేయాలని మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు.

## ఆదర్శ పాఠశాలలో ప్రజాకవి కాళోజీ జయంతి

సిద్ధిపేట జిల్లా దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ఆదర్శపాఠశాలలో తెలుగు భాషా ఉత్సవం నిర్వహించారు. ప్రజాకవి కాళోజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ దుర్గ ప్రసాద్, తెలుగు భాషా ఉపాధ్యాయులు నరేందర్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజాకవి కాళోజీ నారాయణ రావు సేవలను గుర్తు చేసుకున్నారు. కాళోజీ జయంతి సదర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు, పద్య పదరచన, గేయాల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రూప్ 1 టీజీపీఎస్సీ ఫలితాలు రద్దు

ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్ 1 పరీక్షల ఫలితాలలో కీలక పరిణామం చోటుచేసుకుంది. హైకోర్టులో టీజీపీఎస్సీకి ఎదురుదెబ్బ తగిలింది. ప్రకటించిన జనరల్ ర్యాంకింగ్స్ ను, మెయిన్స్ పేపర్ల ఫలితాలను రద్దు చేస్తూ తీర్పు వెలువరించింది. పేపర్ల మూల్యాంఖనంలో తప్పిదాలు జరిగాయని, మెరిట్ లిస్టులో తప్పిదాలు జరిగాయని కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించగా.. ఆ పిటిషన్లు విచారించింది. మెయిన్స్ పేపర్లు రీవాల్యుయేషన్ చేయాలని తీర్పు చెప్పింది. ఒకవేళ రీవాల్యుయేషన్ చేయడం వీలుకాకపోతే మెయిన్స్ పరీక్షలను మళ్లీ నిర్వహించాలని హైకోర్టు స్పష్టం చేసింది.

దశ, హైదరాబాద్

# రూ.10లక్షల గంజాయి పట్టివేత

**ఒడిషా నుంచి హైదరాబాద్ తరలింపు**

**రామోజీ ఫిల్మ్ సిటీ వద్ద పట్టుబడ్డ ముఠా**

**21.33 డ్రై గంజాయి స్వాధీనం**



**దశ, అబ్దుల్లాపూర్‌మెట్:** ఒడిషా నుంచి హైదరాబాద్ నగరానికి అక్రమంగా తరలిస్తున్న (21.33 కేజీల) రూ. 10 లక్షలు విలువ చేసే పొడి గంజాయిని ఎన్‌ఫోర్స్‌మెంట్ రంగారెడ్డి పోలీసులకు పట్టుబడిన సంఘటన రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. హయత్‌నగర్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ధన్వంత్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్‌ఫోర్స్‌మెంట్ రంగారెడ్డి పోలీసులు మంగళవారం రామోజీ ఫిల్మ్ సిటీ వద్ద రూట్ వాచ్ నిర్వహిస్తున్న సమయంలో ఒడిషా నుంచి హైదరాబాద్ నగరానికి వస్తున్న ఒడిషా రాష్ట్రానికి చెందిన బస్సులో తనిఖీలు నిర్వహిస్తుండగా.. రాజస్థాన్ రాష్ట్రం జైపూర్ చెందిన కుష్బు నాయక్, ఒడిషా నుంచి హైదరాబాద్‌కు డెలివరీ చేయిస్తుంటాడు. గోరఖ్ పూర్ కు చెందిన బిరేన్ నాయక్, కోరాపుట్ కు చెందిన రాజేంద్రశెట్టికి హైదరాబాద్‌లో డెలివరీ చేయాలని సూచించాడు. కుష్బునాయక్ సూచన మేరకు బిరేన్ నాయక్ , రాజేంద్రశెట్టి ఇరువురు ఒడిషా నుంచి హైదరాబాద్ తరలిస్తున్న క్రమంలో రామోజీ ఫిల్మ్ సిటీ వద్ద 21.33కిలోల డ్రై గంజాయి పట్టుబడ్డారు. గంజాయి తరలిస్తున్న ఇద్దరితో ప్రధాన నిందితుడు ఫోన్ టచ్‌లో ఉన్నట్లు తెలిపారు.

నిందితులను అరెస్టు చేసి.. ప్రధాన సూత్రదారి వివరాల కోసం ఆరా తీస్తున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న 21.33కిలోల గంజాయి, కేసు వివరాలను తదుపరి దర్యాప్తు కోసం హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు.



మునిసిపల్ కమీషనర్ అమరేందర్ రెడ్డి గారి అధ్యక్షతన కాళోజి గారి 111జయంతి వేడుకలు మంగళవారం ఉదయం తుర్కయంజాల్ మున్సిపాలిటీ యందు నిర్వహించారు. .కాళోజి గారు ఆశించిన సమసమాజ నిర్మాణం కోసం ప్రతీ ఒక్కరు ముందుకొచ్చి పాటు పడాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు . అలాగే ఈ రోజు ను తెలంగాణ భాష దినోత్సవము జరుపుకుంటున్నామని, తెలంగాణ భాషాయొక్క గొప్ప దనాన్ని గురించి వివరించారు. ఈ కార్యక్రమం లో అధికారులు బిక్షపతి , చంద్ర శేఖర్ రెడ్డి , దినేష్, సానిటరీ ఇన్స్పెక్టర్ వనిత, ఇంచార్జ్ ఆర్ ఐ వినయ్ తదితరులు పాల్గొన్నారు. -(దశ, తుర్కయంజాల్ )

## వ్యాధిగ్రస్థులు -అవస్థలు

వ్యాధిగ్రస్థులు వారి అవస్థలు
వంశపారంపర్యంతొ అయిన
పని వత్తిడి మూలంఅయిన
తిన్న తిండితొనైన

నిద్రలేసిన మొదలు
శరీరం నీరసంగా
ఎటు తొయదు
తిండి వంటపట్టదు

మందు గోళీలు వాడుచుండాలి
మౌనంగా కూర్చోవాలి
నొప్పులను భరించాలి
ఒంటరిగా జీవితం గడపాలి

డైగనిస్టిక్ సెంటర్ లొ పరీక్షలు
డాక్టరతోన సంప్రదింపులు
మెడికల్ షాపులో డిస్కౌంట్లు
క్రెడిట్ కార్డుతొ చెల్లింపులు

ఆదాయం వైద్య ఖర్చులకు
అవసరమైతే అప్పు చేయాలి
మిత్తి కట్టలేక బాధపడాలి
దవఖానాలచుట్టు తిరుగుతనే
ఉండాలి

అయితే, వ్యాధి మూలం
తెలుసుకోవాలి
ఆహారములో నియంత్రణ
ఉండాలి,
అవసరము, సలహా మేరకు
వ్యాయామం చేస్తువుండాలి

అసూయ, ద్వేషం వదులుకోవాలి
దయాగుణం కలిగివుండాలి
సంపాదనే ధ్యేయం కాకుండా
కుటుంబంతొ కలిసిమెలిసి
ఉండాలి

జీవిత సత్యం భోదపడితే
భయం వెళ్ళిపోతుంది
మనసు ప్రశాంతంగా ఉంటుంది
వ్యాధి నయమౌతుంది.

రచన:
కడెం. ధనంజయ, చిత్తలూర్

# కాళేశ్వరం పేరిట లక్ష కోట్లు దోచుకున్నారు


❖ తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి



**దశ సూర్యాపేట ప్రతినిధి :** కాళేశ్వరం అవినీతి పై విచారణ నిమిత్తం సిబిఐకి అప్పగిస్తే బిఆర్ఎస్ నాయకులు భయపడుతున్నారని, గుమ్మడికాయ దొంగలు అంటే భుజాలు తడుముకున్నట్టే ఉంది బీఆర్ఎస్ నాయకుల వ్యవహారమని తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ బోర్డ్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లాకేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంతానికి వస్తున్న నీరు కాళేశ్వరం నుంచి వస్తున్నాయా లేక ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి వస్తున్నాయా అనేది ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ప్రజలకు వాస్తవం తెలియజేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని కెసిఆర్ కుటుంబ సభ్యురాలు కవిత ఒప్పుకోవడం నిజం కాదా అని అన్నారు. అవినీతి చేసి రాష్ట్రాన్ని అప్పుల బారిన పడేసిన దోషులను ఎంతటి వారు అయినా శిక్షించాల్సిందేనని డిమాండ్ చేశారు.

జగదీశ్ రెడ్డి సామాజిక మాధ్యమాల్లో అసభ్య పదజాలం ఉపయోగించి కాంగ్రెస్ నాయకులను, ముఖ్యమంత్రిని వారి కుటుంబ సభ్యులను అవమానించడం సిగ్గుచేటు అన్నారు. రాజ్యాంగపరంగా ప్రభుత్వ నిర్ణయాలపై, పాలసీలపై మాట్లాడాలని, జగదీశ్ రెడ్డి ఇలాంటి అసభ్య పదజాలం వాడితే కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఊరుకోబోరని హెచ్చరించారు. యూరియా విషయంలో కేంద్ర ప్రభుత్వం తమ బాధ్యత నిర్వర్తించాలని, దేశవ్యాప్తంగా యూరియా కొరత వస్తుందని బిజెపి నాయకులే చెబుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వంపై నెట్టడం సరికాదన్నారు. తెలంగాణ నుండి ఉన్న కేంద్ర మంత్రులు రైతులకు కావాల్సిన యూరియా కేంద్ర ప్రభుత్వం నుండి అందేలా చూడాలని కోరారు.

యూరియా విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రైతులను ఆదుకునేందుకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నాయకులు మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, డాక్టర్ రామ్మూర్తి యాదవ్, వెలుగు వెంకన్న, వెంకన్న నాయక్, తండు శ్రీనివాస్ గౌడ్, నిమ్మల వెంకన్న, జ్యోతి కరుణాకర్, వల్దాస్ దేవేందర్, పిల్లల రమేష్ నాయుడు, ఫారుక్, దొంతిరెడ్డి సైదిరెడ్డి, యాట ఉపేందర్, ధర్మనాయక్ తదితరులు పాల్గొన్నారు.




# ప్రపంచంతో పోటీ పడే విధంగా నూతన ఎడ్యుకేషన్ పాలసీని తీసుకురాబోతున్నాం

❖ తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి

**దశ, బడంగ్ పేట :** ప్రపంచంతో పోటీ పడే విధం గా నూతన ఎడ్యుకేషన్ పాలసీ ని తీసుకురాబోతున్నామని, తెలంగాణ నూతన ఎడ్యుకేషనల్ పాలసీ నివేదికను ఈ నెల 30వ తేదీ వరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందజేయనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ వి. బాలకిష్టారెడ్డి తెలిపారు. మంగళవారం నాదర్గూల్ లోని ఎంవిఎస్ఆర్ ఇంజనీర్ కళాశాలలో జరిగిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పద్మశ్రీ అవార్డు గ్రహీత, మాజీ డీఆర్డీఓ చీఫ్ కంట్రోలర్, భారతదేశ ఆకాష్ క్షిపణి సృష్టికర్త డాక్టర్ ప్రహ్లాద రామారావు, ఉస్మానియా విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ కె. శశికాంత్ లతో కలిసి ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, పతకాలు, సర్టిఫికెట్లు,డిగ్రీ పట్టాలు అందజేశారు. అనంతరం పద్మశ్రీ అవార్డు గ్రహీత, మాజీ డీఆర్డీఓ చీఫ్ కంట్రోలర్, భారతదేశ ఆకాష్ క్షిపణి సృష్టికర్త డాక్టర్ ప్రహ్లాద రామారావు రక్షణ రంగంలో తన అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ కె. శశికాంత్, మాతృశ్రీ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ పి. వి. ఆర్. కశ్యప్, కార్యదర్శి డాక్టర్ కె. పీ. శ్రీనివాస్ రావు, కోశాధికారి సుధాకర్ జుపుడి, సంయుక్త కార్యదర్శి సూర్య ప్రభాకర్, కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్. కామేశ్వర రావు, పరీక్షల నియంత్రణ అధికారి,సీనియర్ డీన్ పరీక్షల ప్రొఫెసర్ సిపి వర్ధని, గ్రాడ్యుయేషన్ డే కోఆర్డినేటర్లు, ఫ్యాకల్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అధిక నీటి బిల్లులను రద్దు చేయాలి

❖ సీపీఎం రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యుడు కీసరి నర్సిరెడ్డి

**దశ, ఎల్బీనగర్ :** జీహెచ్ఎంసీ అధికారులు ఆదాయాన్ని పెంచుకోవడానికి అక్రమ పద్ధతులకు పాల్పడుతున్నారని సీపీఎం నాయకులు ఆరోపించారు. ఇంటి నిర్మాణానికి కొత్త వాటర్ కనెక్షన్ తీసుకుంటే, వారికి అధిక బిల్లు లేసి వినియోగదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని సీపీఎం రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యుడు కీసరి నర్సిరెడ్డి పేర్కొన్నారు. వాటర్ బోర్డ్ అక్రమంగా వసూలు చేస్తున్న బిల్లును అరికట్టాలని డిమాండ్ చేశారు. వాటర్ బిల్లులు రద్దు చేయాలని సీపీఎం నాయకులు మంగళవారం వాటర్ బోర్డు అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హయత్ నగర్ డిపో పక్కన ఉన్న శ్రీనివాస్ కాలనీలో కొంత కాలంగా కొత్త కనెక్షన్ తీసుకున్న వినియోగదారులపై అక్రమంగా బిల్లులు వసూలు



చేస్తున్నారని, రూ, 600లకు రూ,1800 నుంచి రూ,2000 వరకు నెలనెల వసూలు చేస్తున్నారన్నారు. తక్షణమే మీటర్లను పరిశీలించి లోపాలను సరిచేసి, వినియోగదారుల పైన అదనంగా విధించే ఛార్జీలను తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పబ్బు సత్యనారాయణ, మూషయం నరహరి, గంగుల శ్రీనివాస్ రెడ్డి, నాయిని శ్రీనివాస్, బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కే ఎన్ ప్రసాద్ జన్మదినం సందర్భంగా అన్నదానం

**దశ, నకిరేకల్:** ఫాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ కెఎన్ ప్రసాద్ జన్మదినం సందర్భంగా మంగళవారం ఫ్రీ మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా నకిరేకల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అక్షర ఫౌండేషన్ సహకారంతో ఆటో కార్మికులకు 100 మందికి అన్నదానం చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అక్షర ఫౌండేషన్ ప్రెసిడెంట్ రేపాల సతీష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో లయన్స్ వృద్ధాశ్రమం ట్రస్ట్ చైర్మన్ ఎన్ రామ్మోహన్రావు, క్లబ్ కార్యదర్శి సూర్య చందర్రావు, కోశాధికారి అండెం వెంకన్న, క్లబ్ ప్రతినిధులు సోమా అశోక్, నూనె వాసు తదితరులు పాల్గొన్నారు.





బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమితులైన డా. బూర నర్సయ్య గౌడ్, శాంతి కుమార్ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా నియమితులైన గౌతమ్ రావు , తూళ్ల వీరేందర్ గౌడ్, వేముల అశోక్ ని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు, తుంగతుర్తి నియోజకవర్గ ఇంఛార్జ్ శ్రీ కడియం రామచంద్రయ్య తదితరులు -(దశ, హైద్రాబాద్)

# ఆటోలో టింగు రంగా... పిల్లల ముఠా

**దశ, హైదరాబాద్:** పిల్లలను అపహరించే గ్యాంగుకు దేహశుద్ధి చేశారు స్థానికులు. ఈ ఘటన కొండాపూర్లో చోటు చేసుకుంది. కన్స్ట్రక్షన్ బిల్డింగ్లో వాచ్మెన్ పిల్లలను టార్గెట్ చేసుకుని ఎత్తుకుని వెళ్తున్న ముఠాను రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నారు స్థానికులు. ఈ ముఠాలో ముగ్గురు సభ్యులు ఉండగా.. అందులో ఇద్దరు ఆటోలో తప్పించుకున్నారు. మరొకరు దొరికారు. ఇక ఆమెను స్తంభానికి కట్టేసి కొట్టి గచ్చిబౌలి పోలీసులకు అప్పగించారు స్థానికులు. ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# గ్రూప్ 1పై సీబీఐ ఎంక్వైరీ వేయాలి

❖ వై.సతీష్ రెడ్డి, రెడ్కో మాజీ చైర్మన్



**దశ, రంగారెడ్డి :** గ్రూప్ 1 పరీక్షలో అవకతకవలు జరిగాయని గౌరవ రాష్ట్ర హైకోర్టు వారు గుర్తించినందుకు ధన్యవాదాలని రెడ్కో మాజీ చైర్మన్ వై.సతీష్ రెడ్డిఅన్నారు. హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని , ర్యాంకులు రద్దు చేయడం.. రీ ఎవాల్యుయేషన్ చేయడం మాత్రమే కాదు.. గ్రూప్ 1 పరీక్ష మీద సీబీఐతో ఎంక్వైరీకి ఆదేశించాలని అన్నారు. అవకతవకలకు కారణం ఎవరు.? వాళ్ల వెనకాల ఉన్నవాళ్లు ఎవరనే దానిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి. అప్పుడే అభ్యర్థులకు న్యాయం జరుగుతుందన్నారు. అలాగే.. రీ ఎవాల్యుయేషన్ చేయడం ద్వారా సమస్య పరిష్కారం అవుతుందని అనుకోవడంలేదు. ఎందుకంటే.. గతంలో ఆ ప్రక్రియ నిర్వహించిన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అధికారులు, ప్రభుత్వమే మళ్లీ ఆ పని చేస్తుంది. కాబట్టి అది పారదర్శకంగా జరుగుతుందన్న నమ్మకం లేదు. వాళ్లు మళ్లీ తప్పులు చేసే అవకాశం ఉంది. అందుకే ఈ ప్రక్రియను యూపీఎస్సీకి అప్పగించాలి. లేదంటే హైకోర్టు వారే స్వయంగా ఓ కమిటీని ఏర్పాటు చేయాలి. లోపాలకు తావులేకుండా ఈ ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. అంతేకాదు.. తాము గ్రూప్ 1 పరీక్ష నిర్వహించామని గొప్పలు చెప్పుకుంటున్నసీఎం రేవంత్ రెడ్డి ఈ తప్పిదాలు చేసినందుకు గ్రూప్ వన్ అభ్యర్థుఅందరికి క్షమాపణ చెప్పాలన్నాడు. కనీసం ఈ స్టేజ్ లో అయినా సర్కారు తప్పిదాలు బయటపడ్డాయి. కాబట్టి దీనికికారణమైన వారిపై కఠినచర్యలు తీసుకోవాలి. అప్పుడు మళ్లీ కొత్తగా నోటిఫికేషన్ ఇచ్చి పరీక్ష నిర్వహించాలి. లేకపోతే అభ్యర్థుల భవిష్యత్తు అంధకారం అవుతుందని అన్నారు.

# కోర్టు విధులను బహిష్కరించి న్యాయవాదుల నిరసన



**దశ సూర్యాపేట ప్రతినిధి :** ఇటీవల హైదరాబాదులో న్యాయవాది సురేష్బాబు మీద కొంతమంది వ్యక్తులు దాడి చేసి గాయపరచటాన్ని నిరసిస్తూ మంగళవారం సూర్యాపేట న్యాయవాదులు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొంపల్లి లింగయ్య మాట్లాడుతూ.. హైదరాబాదులో న్యాయవాది బండారు సురేష్ బాబు పై జరిగిన దాడిని సూర్యాపేట న్యాయవాదుల అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తుందని, దాడి చేసిన వ్యక్తులపై వెంటనే కఠిన చర్యలు తీసుకొని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల హక్కులను కాపాడటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని అమలు చేయాలని మనవి చేశారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుంకరబోయిన రాజు, ఉపాధ్యక్షులు గుంటూరు మధు, పూర్వ అధ్యక్షులు వసంత సత్యనారాయణ పిల్లే యాదవ్, కాకి రామిరెడ్డి, సీనియర్ న్యాయవాదులు రాజరికం అనంత కుమార్, తల్లమల్ల హసేన్, బాణాల విజయ్ కుమార్, దొంతర నారాయణ, ఏడిండ్ల అశోక్, కట్టా సుధాకర్, వెంకటేశ్వర్లు, మాంద్ర మల్లయ్య, చంద్రకాంత్, కొమ్ము రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ కళాశాలకు మాతృమూర్తి భౌతిక కాయం అందజేయడం హర్షణీయం

❖ తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి

**దశ సూర్యాపేట ప్రతినిధి :** తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఐజేయు) జిల్లా ప్రధాన కార్యదర్శి బంటు కృష్ణ మాతృమూర్తి బంటు బుచ్చమ్మ చనిపోవడం కుటుంబానికి తీరనిలోటని, తన మాతృమూర్తి భౌతిక గాయాన్ని సూర్యాపేట మెడికల్ కళాశాలకు అందించడం అభినందించదగ్గ విషయమని టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. మంగళవారం ఇటీవల మరణించిన బంటు కృష్ణ మాతృమూర్తి బంటు బుచ్చమ్మ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించి రమేష్ రెడ్డి తదితరులు నివాళులర్పించారు. బంటు కృష్ణ ను, ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా రమేష్ రెడ్డి మాట్లాడుతూ మరణానంతరం కూడా తన భౌతిక కాయం వైద్య



విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఒక ప్రగతికరమైన ఆలోచనతో ముందుకుపోవడం ప్రతి వారికి ఆదర్శనీయమన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు నిమ్మల వెంకన్న, వెలుగు వెంకన్న, తండు శ్రీనివాస్, యాట ఉపేందర్, పిల్లల రమేష్ నాయుడు తదితరులు ఉన్నారు.

# ఎస్సీ ఎస్టీ బిసి పేద విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించాలి

❖ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య.



**దశ సూర్యాపేట ప్రతినిధి :** ఎస్సీ, ఎస్టీ, బిసి పేద విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించాలని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్య పిలుపునిచ్చారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎఏఫ్ఓ విదేశీ విద్య కన్సల్టెన్సీ కేంద్రాన్ని సందర్శించి వెబ్ సైట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ.. విదేశాలలో ఉన్నత విద్య చదువుకునేందుకు గ్రామీణ విద్యార్థులు ఈ కన్సల్టెన్సీ సేవలను సద్వినియోగం చేసుకొవాలన్నారు. అంబేద్కర్, జ్యోతి రావు విదేశీ విద్యా పథకాలపై విద్యార్థులకు అవగహన పెంపొందించాలన్నారు. ఉన్నత విద్య ద్వారా తమ భవిష్యత్తును నిర్మించుకొవాలన్నారు. గ్రామిణ ప్రాంతంలో పేద విద్యార్థులను విదేశాలకు ఉన్నత విద్యకొసం విద్యార్థులకు సహాయం చెస్తున్న చైర్మన్ ను ఈ సందర్భంగా అభినందించారు.